

దారెడ్డి భాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కడప

ఎపి ఎస్‌పిడిసిఎల్ సంస్థలో దారెడ్డి భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివని విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం కడప విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ దారెడ్డి భాస్కర్ రెడ్డి దేశ భక్తి ఎనలేనిదని, జెండా పండుగ రోజు అయన ప్రసంగం పలువురిని ఆకట్టుకుందని పేర్కొన్నారు. విద్యుత్ విజిలెన్సు ఎపిటిఎస్ విభాగనంలో పనిచేయడం సాధారణ విషయం కాదన్నారు. సమస్యల పరిష్కారంలో ఒక ఫ్రెండ్లి పోలీస్‌గా ఉన్నతంగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. సన్మాన సభలో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాగరాజు, నాయక్, రమేష్, రమణారెడ్డి, విజిలెన్సు విభాగం సిబ్బంది, డిఇఇలు, ఎఇలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణ రికవరీ!

100 శాతం వసూలు దిశగా డిసిసిబి
ఆర్నెళ్ల వ్యవధిలో 75 శాతం పూర్తి
ఎనిమిది బృందాలతో కసరత్తు

డిసిసిబి సంస్థాగత సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రుణాల రికవరీ అంశానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దశాబ్దాల తరబడి పేరకుపోయిన సుమారు రూ.3,157 కోట్ల రుణాలను రికవరీ చేయడం ద్వారా ఆర్థిక ఆరోగ్యానికి గట్టి పునాధి వేయడంపై దృష్టి సారించింది. లాంగ్ టర్మ్, షార్ట్‌టర్మ్ రుణాలు, రిటైల్ రుణాలుగా విభజించింది. 2024-25 సంవత్సరంలో డిసిసిబి జిల్లా యంత్రాంగం తలపెట్టిన లక్ష్యాల్ని సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఇంటర్నల్ చెక్స్ అండ్ కంట్రోల్‌పై దృష్టి సారించింది. ఇటువంటి ప్రయోగం ద్వారా సాధించే లక్ష్యాల్ని బట్టి ఆర్థిక జవసత్వాలు ఆధారపడి ఉంటాయని సంస్థ భావిస్తోంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలోని 71 ప్రాథమిక సహకార సంఘాలున్నాయి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన రూ.3,157 కోట్ల రుణాలను రికవరీ చేయడంపై డిసిసిబి దృష్టి సారించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు త్రైమాసికాలకు సంబంధించి ఆశించిన మేరకు రికవరీ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఏడాది చివరి నాటికి 100 శాతం రికవరీ చేయాలనే లక్ష్యాన్ని అందుకునే దిశగా పరుగులు తీస్తోంది. గతేడాది డిపాజిట్లు, ఈ ఏడాది రుణ రికవరీ అంశాలతో సంస్థ ఆర్థిక ఆరోగ్యాన్ని సంతరించుకునే దిశగా సాగుతోందనే వాదన వినిపిస్తోంది. గతేడాది డిసిసిబి సరికొత్త ఆలోచనలతో డిపాజిట్లకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. విద్యార్థులను సైతం పొదుపు దిశగా ప్రేరేపించి భాగస్వాముల్ని చేసింది.

బృందాల వారీగా లక్ష్యాలు

డిసిసిబి రుణ రికవరీ దిశగా వడివడిగా ముందుకు సాగుతోంది. ప్రధానంగా డిసిసిబి అధికార యంత్రాంగం పరిధిలో ఎనిమిది మంది నోడల్ ఆఫీసర్ల పర్యవేక్షణకు నియమించింది. ఒక్కో బృందానికి పది మంది చొప్పున డిసిసిబి ఉద్యోగుల్ని నియమించింది. వీటికి జిల్లా నోడల్ ఆఫీసర్లను బాధ్యుల్ని చేసింది. రోజువారీ లక్ష్యాల్ని సైతం నిర్ణయించింది. ఉమ్మడి కడప జిల్లాలోని 24 బ్రాంచ్‌లు రికవరీ ఆపరేషన్ ప్రయోగాన్ని చేపట్టాయి. ఒక్కో బృందంలో ఇద్దరు డిసిఎం ఆఫీసర్లు, ముగ్గురు ఎజిఎంలు, ముగ్గురు మేనేజర్లు, నలుగురు నుంచి ఐదుగురు బ్రాంచ్ మేనేజర్లు, ఆయా ప్రాథమిక సహకార సంఘాలకు చెందిన అధికారులు ఉండనున్నారు. రికవరీ బృందాలు రుణ గ్రహీతలను సంప్రదించడం, రికవరీ చెల్లింపులకు ప్రోత్సహించడం, పట్టించుకోని గ్రహీతలకు నోటీసులు జారీ చేయడం, న్యాయపరమైన చర్యలకు దిగడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టడం ద్వారా రికవరీలను వేగవంతం చేసే ప్రయత్నం చేస్తోంది.

ఆర్నెళ్లు...75 శాతం రికవరీ!

2024-25 ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు త్రైమాసికాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. డిసిసిబి జిల్లా అధికార యంత్రాంగం నిర్దేశిత రూ.3,157 కోట్ల రికవరీ లక్ష్యంలో రూ.2,700 కోట్ల మేరకు రికవరీ సాధించింది. 75 శాతం లక్ష్యాన్ని సాధించింది. మిగిలిన 25 శాతం లక్ష్యాన్ని ఈ ఏడాది చివరి నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతుండడం గమనార్హం.

రికవరీకి అధిక ప్రాధాన్యత

డిసిసిబి పరిధిలో పేరుకుపోయిన రుణాల రికవరీపై దృష్టి సారించాం. ఆర్నెళ్ల వ్యవధిలో ఆశించిన మేరకు పురోగతి సాధించాం. ఈ ఏడాది చివరి నాటికి వంద శాతం లక్ష్యాన్ని అందుకోగలమనే ఆశాభావంతో ఉన్నాం.

- పి.రాజామణి, డిసిసిబి, సిఇఒ, కడప.

విశాఖ 'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

మోడీ కార్పొరేట్ విధానాలకు స్వస్తి పలకాలి
వామపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



కడప : ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించే కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తి పలకాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, రైతు సంఘం (సిపిఐ) జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, రైతు సంఘం(సిపిఎం) జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ 10 ఏళ్ల కాలంలో మోడీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు భారతదేశంలో పేదరికాన్ని పెంచిందని పేర్కొన్నారు. నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిందని, అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజల ఆదాయాలు పడిపోయాయని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించే భాగంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కు విభజన చట్టంలోని హామీలో భాగంగా కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ ప్రజలు ఎలాంటి సంక్షోభాన్ని ఎదుర్కుంటున్నారో అలాంటి పరిస్థితులే భారతదేశంలో మోడీ ప్రభుత్వం సృష్టించిందని తెలిపారు. దీనికి అదనంగా పరమత ద్వేషం పెరిగి కలిసిమెలిసి ఉండే ప్రజాలమధ్య విద్వేషాలు సృష్టిస్తూ దేశాభివృద్ధికి మతోన్మాద విధానాలు ఆటంకంగా మారాయని తెలిపారు. నిత్యావసరాల ధరలు అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఉపాధి కల్పించే ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం ద్వారా ఆదాయం పొందాలనే దివాళాకోరు విధానాలు అమలపరుస్తామని గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవ చేశారని చెప్పారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేసి, కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని పేర్కొన్నారు. రైతాంగ పంటలకు గిట్టుబాటుధర చట్టం చేసి రైతుల ఆత్మహత్యలు నివరించాలని, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు తగ్గించి, పెట్రోల్, డీజిల్ జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో 18 లక్షల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీచేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, జిల్లా కార్యదర్శి కె.లింగన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) నగర అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు,తారక రామారావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విజయ్,గోపి గిరిజన సమాఖ్య నాయకులు బ్రహ్మం, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, కొండయ్య పాల్గొన్నారు. ధర్నాలో సిఐటియు, ఏఐటియుసి కార్మిక సంఘాల నాయకులు

జమ్మలమడుగు రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు తలమానికమని వెంటనే ప్రయివేటికరణను ఆపాలని సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఏసుదాసు, విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలని నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ ఏ.శ్రీనివాసులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర, శేఖర్, నాగన్న, మున్నా, మోష, భీమా, మన్సూర్, మహ్మద్ హుస్సేన్, సాయి కిరణ్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యా ప్రమాణాలను పెంపొందించాలి

విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా ప్రమాణాలను విద్యాశాఖ కార్యక్రమాలను రాష్ట్రస్థాయిలో ముందుండేలా నడిపించాలని జిల్లా విద్యాశాఖ నోడల్ అధికారి మధుసూదన్ రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారులతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారమంతా యుడిఐఎస్ఇ పని చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల వయసు గల ప్రతి విద్యార్థి పాఠశాలల్లో ఉండేందుకు విద్యా శాఖలోని వివిధ రకాల అనుసంధాన సంస్థలతోపాటు కలసి పనిచేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అన్ని యాజమాన్యాలకు ముఖ్యంగా ప్రభుత్వంతో పాటు ప్రయివేటు ఇతర యాజమాన్యాలకు విద్యార్థులందరికీ విద్యకు సంబంధించిన వసతులు కల్పించడంలో, నాణ్యమైన విద్యార్థులు అందించడంలో విద్య హక్కు చట్టం ప్రకారం చేరాల్సిన వసతులను సమకూర్చే విధంగా చూడాలని ఆదేశించారు. ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని కార్యాలయ సిబ్బందితో విద్యాసంబంధమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అందుకు సంబంధించిన రిపోర్ట్‌ను వెనువెంటనే జిల్లా కార్యాలయానికి పంపించి రాష్ట్రంలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలు మొదటి స్థానంలో పోటీపడాలని తెలిపారు. ఆర్‌టిఇ కారం ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులకు తప్పనిసరిగా అడ్మిషన్ ఇవ్వాలని, లేని పక్షంలో పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ ఆధీనంలో మాత్రమే పనిచేస్తాయని, అవి స్వతంత్ర యాజమాన్యాలు కాదని ఈ విషయాన్ని అన్ని ప్రయివేటు యాజమా న్యాలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. బాలికా విద్యను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూరి బాలిక విద్యాలయాలను ఏర్పాటు చేయడంతో బాలిక విద్యా అక్షరాస్యత గణనీయంగా పెరిగిందని చెప్పారు. అక్కడ విద్యాభ్యాసం అందించిన అనేక మంది బాలికలు ఉన్నత స్థానాల్లో చేరుకుంటున్నారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, అన్నమయ్య జిల్లా అధికారి ప్రకాశ్ రెడ్డి వారి జిల్లాలలో విద్యాపరమైన ప్రగతిని తెలియజేశారు. కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి, ఉప విద్యాశాఖ అధికారులు రాజగోపాల్ రెడ్డి, కృష్ణపర్, పురుషోత్తం, వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఏడి మునీర్ ఖాన్, అన్నమయ్య జిల్లా ఏడి ప్రసాద్ రావు, బుక్స్ గోడౌన్ మేనేజర్ రామానుజ దేవి, మండల విద్యాశాఖ అధికారులు 1,2 సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి మధుసూదన్‌రావు

జల్ జీవన్ లక్ష్యాన్ని సంపూర్తిగా సాధించాలి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించడంతో పాటు వంద శాతం కుళాయి కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా పనుల పురోగతిపె ఆయా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో క్లోరినేషన్ సిస్టమ్‌ను, ఎఫ్‌టికె. పనితీరు, నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సరఫరా, డ్రెయినేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యుఎస్, డిపి స్కీములు, సిపిడబ్ల్యుఎస్ స్కీముల నిర్వహణను పటిష్టం చేయాలన్నారు. ప్రతి ఒక్క ఇంటిక మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నారు. తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు పంపింగ్ నుంచి ఇంటి కుళాయి వరకూ ఎక్కడా లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించేలా చూడాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సిపిఒవెంకట రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఏడుకొండలు, ఇఇలు, డిఇలతో పాటు అన్ని మండలాల ఎఇఇలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గోపవరం : విభిన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విభిన్న ప్రతిభావంతుల చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు కోరారు. మంగళవారం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మండలంలో, బద్వేల్ మున్సి పాల్టీలో విభిన్న ప్రతిభావంతుల పరిస్థితి దుర్భరంగా ఉందని పేర్కొన్నారు. మహిళలు ఇంటికే పరిమితమై కుటుంబాలు పోషించుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి శిక్షణ ఇచ్చి, ఉత్పత్తులు తయారుచేసేలా ప్రోత్సాహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపిడిఒ ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హసీనా, చైతన్య సమితి కనీ నర్ ఎడ్లపాటి నాగమణి, వల్లూరు అనురాధ, పట్టణ అధ్యక్షులు చింత కుంట రఫీ, బాలరాజు, నిరుద్యోగ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

అసంబద్ధ సర్దుబాటు తగదు : 'రూట'

ప్రజాశక్తి - కడప అర్బన్: ఉమ్మడి కడప జిల్లా ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటు తగదని రూట నాయకులు పేర్కొన్నారు. అసంబద్ధ సర్దుబాటు విషయమై రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడప, అన్నమయ్య జిల్లా శాఖల ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, సబాతుర్ రెహమాన్ ఉమ్మడి కడప జిల్లా నోడల్ అధికారి డి.మధుసూదన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం నగరంలోని మానస ఇన్‌లో ఉన్న నోడల్ అధికారికి వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉర్దూ మీడియం పాఠశాలలలో తెలుగు మీడియం విద్యార్థి ఒక్కరూ లేరని, సర్దుబాటుపై వచ్చిన తెలుగు మీడియం ఉపాధ్యాయులకు కనీసం ఉర్దూ వర్ణమాల కూడా రాదని వివరించారు. పరిశీలించి ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేస్తామని నోడల్ అధికారి హామీ ఇచ్చారు. కార్యాక్రమంలో రాష్ట్ర నాయకులు షబ్బీర్, అయ్యూబ్ పాల్గొన్నారు.

జిఒ 85ను వెంటనే ఉపసంహరించాలి

ప్రజాశక్తి-కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 85ను వెంటనే ఉపసంహరించాలని ఎపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోటపాటి రాఘవేంద్ర పేర్కొన్నారు. జిఒకు వ్యతిరేకంగా మంగళవారం వైద్యులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిఒ ద్వారా మూడేళ్ల సర్వీసులకు అర్థం లేకుండా పోయిందన్నారు. రెండు నెలలుగా జిఒను రద్దు చేయాలని అధికారులుకు, ఎమ్మెల్యేలకు అర్జీల ద్వారా విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. జిఒ ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిఒను రద్దు చేయాలని లేకపోతే ఈనెల 13 నుంచి అత్యవసర సర్వీసులు మినహా అన్ని రోజువారి రిపోర్టింగులు, అధికారిక సమాచార సేవలు నిలిపేస్తామన్నారు. 15న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ముట్టడి, 16న నిరవధిక నిరాహార దీక్షకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు.

కోర్సు పూర్తి చేయాలి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

కామర్స్ కోర్సు చదివిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ప్రభావంతంగా కోర్సు పూర్తి చేయాలని వైవీయూ ఆచార్య కె. కృష్ణారెడ్డి ఉద్బోధించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో బికాం ఆనర్స్ నూతన కోర్సు విసి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డితో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సు ప్రారంభించడం ఇది మొదటిసారి అని, విశ్వవిద్యాలయం విద్యార్థుల చదువుకు అన్ని విధాలా అనువైందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మిగితా విశ్వవిద్యాలయాలతో పోల్చు కుంటే యోగి వేమన యూనివర్సిటీలో సదుపాయాలు మరెక్కడా లభిం చవన్నారు. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు సౌకర్య వంతంగా, ఆహ్లాదకరంగా చదువుకోవడానికి ఉపయో గపడ తాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ అధ్యా పకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యాబోధన అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మ, కామర్స్ విభాగ డీన్ ఆచార్య వై.సుబ్బరాయుడు, విభాగ అధిపతి ఆచార్య విజయభారతి, విభాగ సహాయ చర్యలు డాక్టర్ హరినాథ్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రిమినల్, సివిల్ కేసుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప

క్రిమినల్, సివిల్ కేసుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్ భవన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ క్రిమినల్, సివిల్ కేసుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. విద్య హక్కు, ఉచిత న్యాయ సహాయం, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పదకాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, జాతీయ లోక్ అదాలత్, ప్రీ లిటిగేషన్ కేసులు, మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో బసిరెడ్డి లా కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విజయ జ్యోతికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన విజయ జ్యోతిని మంగళవారం ఆమె నివాసంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నంది మండలం విజయ్ సుశీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తమ వంతు సహకరిస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. ఆమె మాట్లాడుతూ కడప జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని, అందుకు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని చెప్పారు.

చేతి రాత ఒక కళ : ఎంఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు మంచిగా రాయడం ఒక కళ అని ఎంఇఒ ఇర్షాద్ అహమ్మద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో ఎస్‌టియు జిల్లా కార్యాదర్శి, హెడ్ టీచర్ ఎస్. నజీబుల్లా ప్రోత్సాహంతో స్కూల్ విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మంచిగా రాయడం కమ్యూనికేషన్‌ను నడిపించే ఇంధనం అన్నారు. కమ్యూనికేషన్ సమాజానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌గా పనిచేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి సాధన చేసి మంచిగా రాయడం (హ్యాండ్ రైటింగ్) నేర్చుకోవాలని పేర్కొన్నారు. హ్యాండ్ రైటింగ్‌తో వ్యక్తి మూర్తిమత్వం కూడా అంచనా వేయొచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి ఇలియాస్ బాషా, హెడ్ టీచర్ ఎస్. నజీబుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో కమలాపురం ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కమలాపురం టౌన్

ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, మానవ వనరుల, ఐటి, శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు విజయ వాడ వరద ముంపు ప్రాం తాలలో ఎపి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం విజయవాడ జక్కంపూడి పరిసర ప్రాంతాల్లోని ఇందిరానగర్‌లో పర్యటించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిత్యావసర వస్తువులు మందులు అందుతున్నాయా? లేదా? అని ప్రజలతోనూ అధికారులతో చర్చించారు. వరద సహాయ కార్యక్రమంలో పాల్గొన్నారు .అలాగే ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఎల్లారెడ్డి, ఆరు మండల తెలుగు యువత అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

ఎంఎస్‌సిలో ప్రవేశానికి 12న చివరి గడువు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్‌సి ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ జియాలజీ కోరులో ప్రవేశాలకు ఈ నెల 11, 12 తేదీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వైవీయూ డైరెక్టరేట్ ఆఫ్ రిజిస్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపిసి, బైపిసిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఓఎండిసి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు 8985597928లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంహెచ్‌ఒను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప కార్పొరేషన్ పరిధిలో కార్మికులు అనారోగ్యం పాలైనా, ప్రమాదం జరిగినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎంహెచ్‌ఒను సస్పెండ్ చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్, యూనియన్ నగర బాధ్యులు ఎస్.గోపి, సిఐటియునగర అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్ర రెడ్డి, పి.వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రొద్దుటూరు, కడపలలో క్లాప్ బండ్లు నడుస్తున్నాయని తెలిపారు. ప్రొద్దుటూరు రెడ్డి ఏజెన్సీ, కడపలో సాయిపావని ఏజెన్సీ ద్వారా నడుస్తు న్నాయని పేర్కొన్నారు. డ్రైవర్లకు కనీస వేతనాలు రావడం లేదని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల కన్నా, ఆయనకు వచ్చే ఆదాయంలో ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఒ మీద అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లకు, వర్కర్లకు పిఎఫ్, ఇఎస్ఐ కట్టక పోయినా పట్టించుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రాత్రులు పనిచేసిన వారికి సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. కార్మికులకు సరైనటువంటి సౌకర్యాలు కల్పించని కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని పేర్కొన్నారు. క్లాప్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేష్ అనారోగ్యానికి గురై హాస్పిటల్‌లో ఉన్నారని తెలిపారు. తక్షణం నరేష్ ఆరోగ్యాన్ని కాపాడి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఒపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

జాతీయ క్విజ్ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కడప అర్బన్

యూనియన్ బ్యాంక్ నెల్లూరులో నిర్వహించిన జాతీయస్థాయి క్విజ్ పోటీలలో కడప ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి తెలి పారు. మంగళవారం విజేతలుగా నిలిచిన విద్యార్థులు భాను తేజశ్వర రెడ్డి, భరత్ కుమార్ రాజును ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జాతీయ క్విజ్ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 976 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో రన్నర్స్ ట్రోఫీని తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎం.వివేకానందరెడ్డి

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - వల్లూరు : రైతు వేసే ప్రతి పంట తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తొలగంగనపల్లి రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సంబంధించి 2024 పంట కాలానికి ఇప్పటివరకు 4769 ఎకరాల వరి, మినుము, పత్తి మొదలగు పంటలు సాగు చేశారని తెలిపారు. ఇప్పటివరకు 1628 మంది రైతులకు గాను 4769 ఎకరాల పంట నమోదు చేశామన్నారు. ఇంకా పంట నమోదు చేయించుకుని రైతులు ఉన్నట్లయితే త్వరగా మీ రైతు సేవ కేంద్రం పరిధిలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ దగ్గర పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు.



పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

యువత దేశాభివృద్ధికి వెన్నెముక : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

యువత దేశాభివృద్ధికి వెన్నెముక వంటి వారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు రాజు ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య నిర్మూలన కోసం చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలను, మత్తు నివారణ చర్యల పోస్టర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యువత సరదా కోసం మత్తు పదార్థాలు, పానీయాలు అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, భవిష్యత్ తరాలు అంధకారం అయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యువత మారాలని, మాదకద్రవ్యాలు మానాలని ఆయన పిలుపునిచ్చారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైసిపి నాయకులు బయపురెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు ఉదయ్‌కిరణ్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మత్తుకు యువత చిత్తు.. దేశ అభివృద్ధికి చేటు పేరిట స్థానికంగా మంగళవారం ప్రొద్దుటూరు స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విజయకుమార్ థియేటర్ సర్కిల్ నుండి పుట్టపర్తి సర్కిల్ వరకు స్వచ్ఛంద సేవా సంస్థలు, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు ప్లకార్డ్స్‌తో ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తి సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి యువత మత్తు పదార్థాలు బానిసలు కాకుండా దేశాభివృద్ధికి తోడ్పడాలని ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి భక్తవత్సలం, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిద్దేశ్వర రావు, అధ్యాపకులు, స్టార్ ఫౌండేషన్ సిరాజుద్దీన్, ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలసూర్య, వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తూ మొగమూరు నదిలో పడి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఆదుకుంటామని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి తేజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న పాలూరు వంశీ, జరిపిటి రాజా మృతదేహాలను రవితేజారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ సందర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిమజ్జన సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి అందుబాటులో లేకపోవడం వల్ల ఆయన ఆదేశాల మేర కు తాను వచ్చినట్లు రవితేజారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నేతలు వేమా కు మార్, రజనీకాంత్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్ పాల్గొన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రవితేజారెడ్డి

నిమజ్జనంలో అపశృతులు అరికట్టాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక నిమజ్జనం సందర్భంలో అనేక చోట్ల అపశృతులు చోటు చేసుకోవడం దురదృష్టకరం, బాధాకరమని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరపునాయునిపల్లి మండలం పాలగిరి క్రాస్ వద్ద మొగమూరు నదిలో పడి వేంపల్లెకు చెందిన జరిపిటి రాజా, డ్రైవర్ వంశీ మృతి చెందారని చెప్పారు. చక్రాయపేట మండలం ఆంజనేయపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి పోలేపల్లి గౌతమ్ కాలేటి వాగులో నిమజ్జనం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో నేర్సుపల్లి క్రాస్ వద్ద ట్రాక్టర్ మీద నుంచి పడి చనిపోయాడని తెలిపారు. ఆదిత్య అనే వ్యక్తికి గాయాలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం అధికారులతో జాగ్రత్తలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు.

ఒంటి కన్నుతో మేక పిల్ల జననం

- ఆసక్తిగా తిలకిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఒంటి కన్నుతో మేక పిల్ల పుట్టడంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకిస్తున్నారు. మంగళవారం మండలంలోని గురజాల గ్రామానికి చెందిన కొమ్మెర శ్రీనివాసులుకు సంబంధించిన ఓ మేక రెండు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఒక పిల్లకు నుదుటన ఒకే కన్ను ఉంది. మరో పిల్ల రెండు కళ్లతో సాధారణంగా జన్మించింది. రెండు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయి. ఈ విషయమై బిదినంచెర్ల పశువైద్యాధికారి యూసఫ్ అడగ్గా.. జన్యుపరమైన లోపంతో ఒక కన్నుతో పుట్టిందని తెలిపారు. ఇలా పుట్టడం అరుదుగా జరుగుతుందన్నారు. ఇలా పుట్టిన పిల్లలు బతకడం చాలా కష్టమన్నారు.



కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

- రూ.మూడు లక్షలు నష్టమని బాధితుడి ఆవేదన

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని దేవరగట్టుపల్లెలో మంగళవారం కుక్కలు దాడి చేయగా 20గొర్రెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. అదే గ్రామానికి చెంఇన వెంకట కొండయ్య గొర్రెలను మేపుకుని జీవనం కొనసాగించుకునేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఊరు బయట కలములో 20గొర్రెలను ఉంచాడు. వీటిపై నాలుగు కుక్కలు దాడి చేశాయి. దాడిలో 20గొర్రెలు చనిపోయాయి. దాదాపు రూ.3లక్షలు నష్టం వాటిలినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రెలతో జీవనోపాధి చేసుకుంటున్న వెంకట కొండయ్యకు ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

అక్రమంగా నల్ల కార్బన్ పౌడర్ డంపు

అనుమతుల్లేకుండా అక్రమ రవాణా - పర్యావరణం, ప్రాణాలకు హాని



నల్ల కార్బన్ పౌడర్‌ను తరలిస్తున్న ట్యాంకర్

ప్రజాశక్తి - ముద్దనూరు

మొక్కలు నాటి, వాటిని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల ద్వారా ప్రకృతిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు భిన్నంగా ముద్దనూరు- జమ్మలమడుగు కొండ ప్రాంతంలో పర్యావరణానికి, ప్రజలకు, జంతువులకు హాని కలిగేలా కొందరు అక్రమార్కులు నల్ల కార్బన్ పౌడర్ రవాణా చేసుకుని డంపు ఏర్పాటు చేసి తరలిస్తున్నారు. వాతావరణానికి, జంతువులు, మనుష్యులకు హాని కలిగించే నల్ల కార్బన్ పౌడర్ అక్రమంగా రవాణా చేసుకుని డంపు ఏర్పాటు చేసి పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ముద్దనూరు జమ్మలమడుగు 67వ జాతీయ రహదారి సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వెనకాల అనుమతి లేకుండా అక్రమంగా కార్బన్ పౌడర్ డంపు ఏర్పాటు చేశారు. నల్ల కార్బన్ పౌడర్ లారీ ట్యాంకర్ల ద్వారా ఇక్కడికి రవాణా చేసుకుని ఇక్కడి నుంచి సిమెంట్ కర్మాగారాలకు తరలిస్తున్నారు. దీని వల్ల చెట్లు, నీరు, గాలి, ప్రకృతి, వాతావరణం కాలుష్యం బారిన పడుతున్నాయి. అటవీ, రెవెన్యూశాఖల అధికారుల అనుమతి లేకుండా ట్యాంకర్ల ద్వారా నల్ల కార్బన్ పౌడర్ తంలించి డంపు ఏర్పాటు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నల్ల కార్బన్ పౌడర్ వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రకృతికి, వాతావరణానికి, ప్రాణులకు ముప్పు కలిగించే ప్రమాదకర నల్ల కార్బన్ పౌడర్ రవాణా, డంపును తొలగించి పర్యావరణాన్ని పరి రక్షించాలని స్థానికులు కోరు తున్నారు. అటవీశాఖ, రెవెన్యూ అధికారులు స్పందించి డంపు నిర్వహిస్తున్న నిర్వాహకులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



క్రేన్ ద్వారా దిగుమతి అవుతున్న పౌడర్

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితం



ముద్దనూరు : వైద్య పరీక్షలు చేస్తున్న కరిష్మా

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితమని, హై రిస్క్ గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కరిష్మా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుకలు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజూ ఉదయం వ్యాయామం చేయాలన్నారు. పౌష్టికాహారం తీసు కోవాలన్నారు. ఐరన్, క్యాల్షియం మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రసవం కోసం 108, 102 వాహనాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంత వైద్యులు సుదర్శన్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభాకుమారి, స్టాఫ్‌నర్స్ స్టెఫి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మాసిస్ట్ జగదీశ్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యురాలు స్వాతిసాయి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు నాలుగవ నెల నుంచి 9వ నెల వరకు ప్రతి నెల 9, 10వ తేదీల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. కార్ర్యమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అరుణ దేవి, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పక ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తప్పక తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో పోషణ మాసోత్సవాలు సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా చాలా రోగాలను నివారించవచ్చన్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాల ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరయ్య, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, నాగమునెమ్మ, పార్వతమ్మ, రమాదేవి, యల్లమ్మ, విజయ, జిఎంఎస్ కే ప్రసన్న, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని, శిశు మరణాలను అరికట్టడమే ప్రభుత్వ ధ్యేయమని పిహెచ్‌సి డాక్టర్ ఎస్.ముబీన్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య విస్తరణ అధికారి నాగ భూషణం, సూపర్వైజర్ కృష్ణప్రియ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత, స్టాఫ్‌నర్స్ సుప్రజ లావణ్య, కాంతమ్మ, ఫార్మసిస్ట్ కేశవయ్య, ల్యాబ్ టెక్నీషి యన్ దుర్గాప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, సుజాత, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఆర్‌సిడిఎస్ జాతీయ అధ్యక్షుడు ఒంటెద్దు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ప్రతినెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చాపాడు మండలం నరహరిపురానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ నందిమండలం సోమ సుబ్బారెడ్డి పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సు జాత, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



కొండాపురం : ఆర్‌సిడిఎస్ ఆధ్వర్యంలో భోజనం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

ఎస్ఆర్ఐటిలో ఇంటర్నల్ హ్యాకథాన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని లింగాపురం వద్ద ఉన్న సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సిఎస్ఇ డిపార్ట్మెంట్ ఇంటర్నల్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండు రంగన్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాటాడుతూ జీవితంలో మనం ఎదుర్కునే కొన్ని ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి, ఉత్పత్తి, ఆవిష్కరణ, సంస్కృతి, సమస్య పరిష్కారానికి ఈ వేదిక ఉప యోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.సుబ్బారెడ్డి 2024 హాక్‌థాన్ నుంచి ఎంపిక చేసిన 20 జట్లను స్మార్ట్ ఇండియా 2024 హాక్‌థాన్‌లో ఎస్ఆర్ఐటి ద్వారా నామినేట్ చేయబడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి తమలపాకుల మాల వితరణ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమ జిల్లాలలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం శ్రీవీరాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రొద్దుటూరు వాస్తవ్యులు కీర్తిశేషులు దేవిరెడ్డి సుబ్బారెడ్డి, కూర శ్రీవాణి వీరి మనవడు దేవిరెడ్డి భరత్‌రెడ్డి, దేవిరెడ్డి సుదీప్‌రెడ్డి వెండితో తయారు చేసిన 54 తమలపాకుల మాలను వితరణ చేశారు. దాదాపు 540 గ్రాములతో రూ.46వేలు విలువ ఉంటుందని అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేసి,శేష వస్త్రం, స్వామి వారి చిత్రాపటాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు.. జీవితమే ముద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆత్మహత్యలు వద్దు-జీవితమే ముద్దు, ఆశతో జీవిద్దాం- ఆత్మహత్యలు నివారిద్దాం అనే నినాదాలతో మంగళవారం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సిబ్బంది, సాధన నర్సింగ్ కాలేజ్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫార్మా, శ్రీనివాస ఫార్మా కళాశాలల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గతంలో కన్నా ఈ సంవత్సరం ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత దేశంలో ఎక్కువ మం ది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. యు వత, రైతులు, మహి ళలు ఎక్కువగా ఆత్మ హత్యల ఆలోచన చేస్తున్నారని తెలి పారు. మానసిక ఆం దోళన పెరగడంతోనే ఆత్మ హత్యల ఆలోచన చేస్తున్నారని తెలి పారు. ఈ పరిస్థితి నుండి వారిని బయట పడేసేందుకు తోటి వారు వారికి భరోసా కల్పిం చాలన్నారు. ఆత్మహత్యల ఆలోచన చేసే వారికి కౌన్సె లింగ్, వైద్య సహాయం కోసం 14416 టోల్ ఫ్రీ నె ం బ ర్ న ు సంప్రదించాలని సూచించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న సిఐ లింగప్ప

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని జమ్మలమడుగు అర్బన్ సిఐ లింగప్ప కోరారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలు అభినందనీయమన్నారు. నియమాలు పాటించి ముందుకు వెళితే అందరికి బాగుంటుందని సూచించారు. ప్రతి డ్రైవర్ వద్ద లైసెన్స్, ఆటో రికార్డ్‌తోపాటు యూనిఫామ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలో అపరిచితులు, దొంగలు, అనుమానితులుగా కనపడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా నడుచుకోవాలన్నారు. ఆటోలపై పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు రాకుండా వారితో మసులుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, కల్పన, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



చాపాడు : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు

జిఒ మార్చడం అన్యాయం : వైద్యులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు జిఒ నంబర్ 85కి వ్యతిరేకంగా తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు అధికారిక నోటీసు అందజేశారు. నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జిఒను అన్యాయంగా పరిగణించి సమ్మె ప్రారంభించామన్నారు. తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా అకస్మాత్తుగా జిఒను మార్చడం అన్యా యమన్నారు. తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే నిరసనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చాపాడు, నక్కలదిన్నె వైద్యాధి కారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, కావ్య మాధురి, ఓబులేసు పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒ 85ను వెంటనే ఉపసంహరించాలని ఎపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఘం నాయకులు డాక్టర్ నిజాముద్దీన్, పృథ్వీ, లక్ష్మీప్రియ కోరారు. ఆ మేరకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిం చడంతోపాటు నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో తాళ్లపల్లె పిహెచ్‌సి వైద్యురాలు స్వాతిసాయి, చక్రాయపేట వైద్యురాలు స్వర్ణలత, వేముల వైద్యురాలు శరణ్య, విఎన్ పల్లి వైద్యురాలు తాహ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల రూరల్ : పులివెందుల శ్రీరంగనాథ స్వామి నూలుపూజా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు తన దేవరులతో కలిసి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 8న ప్రారంభమైన నూలు పూజా ఉత్సవాలు 16వ తేదీన ముగియనున్నాయి. 14న శనివారం ఉదయం శ్రీరంగనాథ స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఇఒ వెంకటరమణ తెలిపారు. మంగళవారం కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లె కృష్ణ రాజేష్ శర్మ నేతృత్వంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.